సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
78932 44734
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

న్యూ ఇయర్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అగ్నికుల క్షత్రియ ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు

సింధియా: షిప్‌యార్డ్ అగ్నికుల క్షత్రియ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. సంఘ అధ్యక్షుడు కె.ఎం.జి.గణేష్ ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షులు లంకాడ వెంకట శ్రీకాంత్, పోతాబత్తుల అనిల్‌కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించి సంఘ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కాళ్ల అదినారాయణ, కోశాధికారి యర్రా శ్రీనివాసరావు, వై.గోవిందరాజులు, నానాజీ, సోమశేఖర్, సుధాకర్, భాస్కర్, వెంకటేశ్వరరావు, వెంకటరమణ, సురేష్, రాజు, ధనరాజు, శేఖర్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళాల నడుమ కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : సహస్రాది తులసీ దళాల నడుమ సిరులతల్లి కనకమహాలక్ష్మి అమ్మవారు నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం సహస్ర తులసిపూజను శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వి. రాంబాబు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వజ్ర కవచధారిగా శ్రీవారు



ప్రత్యేక అలంకరణలో శ్రీనివాసుడు

ఎంవీపీ కాలనీ: సెక్టార్‌–6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం 21వ పాశుర విన్నపాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీవేంకటేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. వేంకటేశ్వరస్వామితో పాటు పద్మావతిదేవి, గోదాదేవి అమ్మవార్లను వజ్రకవచాలతో సుందరంగా అలంకరించారు. ఉదయం జరిగిన తీర్థప్రసాద గోష్ఠిలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

8న వైదిక సదస్సు

సీతంపేట : శంకరమఠంలో ఈ నెల 8వ తేదీన కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి పురోహిత, అర్చక వర్గ సభ్యులతో వైదిక సదస్సు నిర్వహించనున్నారు. విజయ యాత్ర సందర్భంగా ఆయన శంకరమఠానికి ఇటీవల విచ్చేయగా.. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆదివారం సాయంత్రం 6 గంటలకు వైదిక సదస్సు నిర్వహిస్తున్నారని.. అర్చక, పురోహితులు స్వామి అనుగ్రహాన్ని పొందగలరని శంకరమఠం ప్రతినిధులు ఓ ప్రకటనలో కోరారు. సదస్సులో పాల్గొనే వారు 94415 03935, 99898 93557లో సంప్రదించవచ్చు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
9398184202, 9912440606

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



శ్రీహరిపురం బస్టాప్ వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్

- కలవరపడుతున్న పాదచారులు, వాహన చోదకులు
- సర్వీస్ రోడ్ల నుంచి తరలించాలని పలువురి డిమాండ్

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో గల సర్వీస్ రోడ్లలో పలు చోట్ల ఏపీఈపీడీసీఎల్ అధికారులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. అయితే కొన్నిచోట్ల అవి ప్రమాదకరంగా మారడంతో వాహనచోదకులు, పాదచారులు భయపడుతున్నారు. పారిశ్రామిక ప్రాంతంలో జనావాసాలు పెరగటం, ప్రజల విద్యుత్ అవసరాలు పెరగటంతో మల్కాపురం, శ్రీహరిపురం విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారులు ఇటీవల కొత్తగా పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. దీంతో ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ కోతలు, విద్యుత్ హై–లో ఓల్టేజ్ సమస్యకు కాస్త ఉపశమనం కలిగింది. అయితే ఇప్పుడు కొత్త సమస్య వచ్చింది. కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల నుండి అప్పుడప్పుడు శబ్దాలు, చిన్నపాటి నిప్పు మాదిరిగా వస్తుండటంతో ఆ సమయంలో రాకపోకలు సాగించే వారు భయపడుతున్నారు. శ్రీహరిపురం బస్టాప్ వద్ద 315 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవటంతో చుట్టుపక్కల వారు భయపడుతున్నారు. చిన్నపిల్లలు ఆ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ముట్టుకుంటారేమో అని పలువురు కలవరం చెందుతున్నారు. అలాగే మల్కాపురం బస్టాప్ వద్ద, ఆర్‌కేపురం చర్చి లైన్ వద్ద, పాత పెట్రోల్ బంక్ సర్వీసు రోడ్డు వద్ద 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినా ఇక్కడ వాటి రక్షణకు కంచె ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు భయపడుతున్నారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధి అధికారులు స్పందించి సర్వీస్ రోడ్లలో కాకుండా జన సంచారం తక్కువగా ఉండే చోటికి ట్రాన్స్‌ఫార్మర్లను తరలించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



ఆర్‌కే పురం సర్వీస్ రోడ్డులో రక్షణ లేని 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్

కంచె ఏర్పాటు చేయాలి



మల్కాపురంలోని పలు చోట్ల ఇటీవల ఏర్పాటు చేసిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచెలు ఏర్పాటు చేయలేదు. సర్వీస్ రోడ్లలో వీటిని ఏర్పాటు చేయటం వలన ఏదైనా వాహనం ఢీకొంటే పెద్ద నష్టం తప్పదు. అధికారులు ఈ సమస్యపై స్పందించాలి.

– శీర చిన్నాజీ యాదవ్, మల్కాపురం

సర్వీస్ రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ వద్దు



పలు వాహనాలు రాకపోకలు సాగించే చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. వాటి నుండి ఒక్కోసారి శబ్దాలు.. చిన్నచిన్న నిప్పురవ్వలు వస్తున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ పేలి.. ఆ సమయంలో జనం ఉంటే నష్టమే కదా. అధికారులు ఈ సమస్యపై స్పందించాలి.

కాకర ప్రకాష్, వాహనదారుడు

ఆడారి తులసీరావుకు అశ్రునివాళి



ఆడారి తులసీరావు పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: అనారోగ్యంతో మృతి చెందిన ఆంధ్రా కురియన్ విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావుకు జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ నివాళులర్పించారు. గురువారం యలమంచిలిలోని ఆయన ఇంటి వద్ద తులసీరావు పార్థివ దేహంపై పూల మాలలు వేసి సంతాపం తెలిపారు. తులసీరావు తనయుడు, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌ను కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. జియ్యానితోపాటు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల సంతాపం

మల్కాపురం: విశాఖ డైయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు మృతికి వైఎస్సార్‌సీపీ పారిశ్రామిక ప్రాంత నాయకులు సంతాపం తెలిపారు. 59వ వార్డు హిమాచల్ నగర్ సామాజిక భవనంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ యాదవ్, పార్టీ వార్డు అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్, వార్డు ఇన్‌చార్జి రేవళ్ల సత్యనారాయణ, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రతినిధి ఎం.పెంటారావు, సీనియర్ నాయకులు పొట్టిమూర్తి తదితరులు ఆడారి తులసీరావు ఫ్లెక్సీకి పూలమాలలు వేసి అశ్రునివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ డెయిరీని స్థాపించి వేలాది కుటుంబాల్లో తులసీరావు జ్యోతులు వెలిగించారని కొనియాడారు. తన ట్రస్టు ద్వారా నిరుపేదల కుటుంబాలను ఆదుకుని వారి కన్నీటిని తుడిచిన గొప్ప వ్యక్తని పేర్కొన్నారు. మల్కాపురంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు ఆడారి తులసీరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.



59వ వార్డులో ఆడారి తులసీరావు ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పండగ వేళ అప్రమత్తం

- ఇళ్లల్లో దొంగతనాలు, సైబర్ మోసాలపై క్రైం పోలీసుల అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న క్రైం సీఐ దుర్గాప్రసాద్

మద్దిపాలెం: సంక్రాంతి పండగ సమీపిస్తున్న వేళ.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కంచరపాలెం క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు. నేటి రోజుల్లో జరుగుతున్న ఇళ్లల్లో దొంగతనాలు, సైబర్ మోసాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఈ మేరకు గురువారం కంచపాలెం పోలీస్ స్టేషన్ పరిధి ఓల్డ్ ఐటీఐ దరి సిద్ధార్థనగర్‌లోని ఓ పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో క్రైం సీఐ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ స్థానికులకు సూచనలిచ్చారు. ఆన్‌లైన్ మోసాలు, ఇంటి దొంగతనాలు ఎలా జరుగుతాయో అన్న విషయంపై అహగాహన కల్పించారు. సంక్రాంతికి ప్రజలు సొంతూళ్లకు వెళ్తుంటారని, ఆ సమయంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతాయన్న నేపథ్యంలో ఇంటిని, ఇంట్లో విలువైన వస్తువులను ఎలా భద్రపరుచుకోవాలో వివరించారు. ముందస్తు చర్యగా పోలీసులకు సమాచారం అందిస్తే నిఘా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఊర్లో ముందు లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. ఇంటి పరిసరాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే 100కు డయల్ చేసి సమాచారమివ్వాలని కోరారు. తద్వారా కొంతమేర దొంగతనాలను నియంత్రించవచ్చన్నారు.

లోన్ యాప్స్‌తో జాగ్రత్త..!

ఇటీవల కాలంలో పలు లోన్ యాప్స్ చేస్తున్న సైబర్ మోసాలపై స్థానికులకు సీఐ దుర్గాప్రసాద్ అవగాహన కల్పించారు. రిజర్వ్ బ్యాంక్ అనుమతి లేని లోన్ యాప్స్‌లో లోన్స్ తీసుకోవద్దని హెచ్చరించారు. అతి తక్కువ వడ్డీకే లోన్స్ ఇస్తామని ప్రజలను మభ్యపెట్టి లోన్ తీసుకున్న తరువాత వారి కుటుంబాన్ని వేధింపులకు గురిచేస్తున్న యాప్స్‌లో రుణాలు తీసుకోవద్దని సూచించారు. పర్సనల్ లోన్స్ కోసం ఫోన్‌లో వచ్చిన లింక్‌లను ప్రెస్ చేయవద్దని, నకిలీ యాప్స్‌తో జాగ్రత్తగా ఉండాలని, వాటిని డౌన్‌లోడ్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో సంక్రాంతి పండగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రైం ఎస్ఐ సునీల్, ఏఎస్ఐ సతీష్ పాల్గొన్నారు.

నిబద్ధతకు మారుపేరు రామకృష్ణంరాజు



రామకృష్ణంరాజు చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న మేయర్ హరివెంకటకుమారి దంపతులు

మురళీనగర్(విశాఖ ఉత్తర): శ్రీదేవి కేబుల్ టీవీ చానల్ చైర్మన్ దివంగత ఇసుకపల్లి రామకృష్ణంరాజు నిబద్ధతకు మారుపేరుగా నిలిచారని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. మురళీనగర్‌లో గురువారం జరిగిన సంస్మరణ కార్యక్రమంలో మేయర్ దంపతులు పాల్గొని రామకృష్ణంరాజు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రామకృష్ణంరాజు అతి సామాన్య వ్యక్తిగా జీవితాన్ని ప్రారంభించి నిబద్ధతతో పనిచేసి ఉన్నత స్థానానికి ఎదిగారన్నారు. డిజిటల్ ప్రసారాల్లో కొత్త అధ్యాయాన్ని సృష్టించారని, కేబుల్ రంగంలో ఆయన సేవలు మరువలేనివన్నారు. రామకృష్ణంరాజు కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించి, ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు, నాయకుల నివాళి.. ఇసుకపల్లి రామకృష్ణంరాజుకు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, గొలగాని శ్రీనివాస్, మహారాజా బ్యాంకు చైర్మన్ మంతెన రామకృష్ణరాజు, ఎంఎస్‌వోలు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

పదునైన కత్తి వంటిది ప్రజాస్వామ్యం



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అనురాధ

సీతంపేట: ప్రజాస్వామ్యం రెండు వైపులా పదునైన కత్తివంటిదని, పరిస్థితులను బట్టి మారుతుంటుందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వై.వి.అనురాధ అన్నారు. సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్, విశాఖ పబ్లిక్ లైబ్రరీ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'చాలెంజెస్ కాన్‌ఫ్రాంటింగ్ ఇండియన్ డెమోక్రసీ' అనే అంశంపై ఆమె ప్రసంగించారు. జిల్లా కలెక్టర్‌గా, వివిధ హోదాల్లో తను పనిచేసిన అనుభవాలను, పరిపాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని వివరించారు. అనంతపురం, గుంటూరు జిల్లాల్లో ఎదుర్కొన్న సమస్యలను తెలియజేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఒక భాగస్వామ్యమన్నారు. జనాభా, వనరుల కొరత, ఎన్నికల విధానం, ప్రజాస్వామ్యంపై ప్రభావం చూపిస్తాయని చెప్పారు. నీటి పారుదల శాఖ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ యు.ఎస్.రాజు మాట్లాడుతూ పాలన సంస్కరణలకు సంబంధించి ప్రముఖులు చేసిన అభిప్రాయాలను వివరించారు. రాజకీయాలు, మతం అంశాలపై తన మనోభావాలను పంచుకున్నారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఎ.ప్రసన్న కుమార్, పౌర గ్రంథాలయం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.విజయ్‌కుమార్, డి.ఎస్.వర్మ, డి.వి. సూర్యారావు పాల్గొన్నారు.

పాత్రికేయుల సంక్షేమ బాధ్యత ప్రభుత్వానిదే



టాస్ వేస్తున్న బొలిశెట్టి సత్యనారాయణ

విశాఖ స్పోర్ట్స్: అంతర మీడియా స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా గురువారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోర్ట్ మైదానంలో ఈ పోటీలను జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిసెట్టి సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాన్యులకు అండగా నిలిచే పాత్రికేయుల సంక్షేమ బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు. వీజేఎఫ్‌కు సుదీర్ఘ కాలం పాటు సేవలందించిన దుర్గారావు, శ్రీదేవి చానల్ రామకృష్ణంరాజు, బీజేపీ నాయకుడు పి.వి.చలపతిరావు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీజేఎఫ్, విస్జా ప్రతినిధులు, క్రికెట్ జట్ల సభ్యులు పాల్గొన్నారు. ఇప్పటికే అథ్లెటిక్స్, ఇండోర్ క్రీడలు ముగియగా.. క్రికెట్ పోటీలు ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

లోకల్ చానల్, కెమెరామెన్ జట్ల విజయం

తొలిరోజు జరిగిన పోటీల్లో లోకల్ చానెల్ జట్టు ఐదు వికెట్ల తేడాతో ప్రజాశక్తి జట్టుపై విజయం సాధించింది. ప్రజాశక్తి జట్టు తొలుత బ్యాటింగ్ చేసి మూడు వికెట్లకు 87 పరుగులు చేయగా.. లోకల్ చానల్ జట్టు ఐదు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. మరో పోటీలో కెమెరామెన్ జట్టు ఆరు వికెట్లకు 127 పరుగులు చేయగా.. వెబ్ చానల్స్ జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 84 పరుగులతో ఆటను ముగించింది.

రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన



వీడియో ప్రదర్శనను తిలకిస్తున్న వాహన చోదకులు, పాదచారులు

అల్లిపురం : రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నగర పోలీసులు వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా రద్దీ ప్రాంతాల్లో వీడియోలు ప్రదర్శిస్తూ వాహన చోదకులు, పాదచారులకు అవగాహన కల్పిస్తున్నారు. గురువారం సాయంత్రం టౌన్ కొత్తరోడ్డు వద్ద వీడియో ప్రదర్శన ద్వారా రోడ్డు ప్రమాదాలకు గల కారణాలను ప్రజలు, వాహన చోదకులకు వివరించారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, ట్రాఫిక్ ఏడీసీపీ ఎస్‌కే ఆరిపుల్ల ఆదేశాల మేరకు క్రైం ప్రివెన్షన్, రోడ్ యాక్సిడెంట్ ప్రివెన్షన్ వాహనాన్ని ప్రజల మధ్యకు తీసుకువచ్చారు. దాని సహకారంతో సిటీలోని ముఖ్య కూడళ్ల వద్ద వాహనాన్ని నిలిపి ఇప్పటి వరకు సిటీలో ఊహించని విధంగా జరిగిన రోడ్డు ప్రమాదాలను వన్‌టౌన్ ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు వీడియో రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు రోడ్డుమీద ప్రయాణిస్తున్న సమయంలో వేగాన్ని తగ్గించుకోవాలని, ముఖ్యమైన కూడళ్ల వద్ద జాగ్రత్తగా మలుపులు తిరగాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని వివరించారు. ప్రమాదాలను అరికడదాం.. సురక్షితంగా ప్రయాణిద్దాం అనే నినాదంతో విశాఖ సిటీ ట్రాఫిక్ పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

డీఆర్‌ఎంకు రోటరీ క్లబ్ సత్కారం



మాట్లాడుతున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: రోటరీ క్లబ్ విశాఖపట్నం ప్రతినిధులు గురువారం డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్‌ఎం) అనూప్‌కుమార్ సత్పతిని ఘనంగా సత్కరించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో డీఆర్‌ఎం ముఖ్య అతిథిగా మాట్లాడారు. తన గొప్పతనమంతా విశాఖ వాసులు, ప్రజా ప్రతినిధులు, మీడియా, వాల్తేర్ టీం సభ్యులకు చెందుతుందని తెలిపారు. వీరందరి సహాయ సహకారాలతో ఈ ప్రాంత ప్రజలు, ప్రయాణికుల డిమాండ్‌లు, అవసరాలను తీర్చగలుగుతున్నానని చెప్పారు. రైల్వే ప్రయాణికులకు మరిన్ని సేవలందించే విషయంలో తన కృషి కొనసాగుతుందన్నారు. ప్రయాణికుల సౌకర్యాల మెరుగుకు వాల్తేర్ డివిజన్ తీసుకుంటున్న పలు చర్యలను గురించి ఆయన క్లుప్తంగా వివరించారు. భవిష్యత్తులో రైల్వేలో ఆధునిక పరిజ్ఞానంతో కూడిన ప్రపంచ స్థాయి సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖపట్నం ప్రెసిడెంట్ బి.మధు, సెక్రటరీ జి.శ్రీనివాస్, ఇతర ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

గాంధీజీ వీధిలో పందుల బెడద



గాంధీజీ వీధిలో సంచరిస్తున్న పందులు

మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతంలో పందుల బెడద రోజు రోజుకు అధికమవుతోంది. పందుల సంచారంతో ఆయా ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 61వ వార్డు పరిధి మల్కాపురం, గాంధీజీవీధిలో నెల రోజులుగా పందులు గుంపులు గుంపులుగా తిరుగుతూ పరసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. మల్కాపురం, మరిడిమాంబ ఆలయానికి ఆనుకుని ఉన్న గెడ్డలో పదుల సంఖ్యలో పందులు సంచరిస్తూ, అక్కడి వ్యర్థాలు భుజిస్తున్నాయి. అంతే కాకుండా ఆ వ్యర్థాలను సేవా మార్గాల పైకి తీసుకువస్తున్నాయి. అలాగే పల్లివీధి, గొల్లవీధి ప్రాంతాల్లో సంచరిస్తు పరిసరాలను పాడు చేస్తున్నాయి. ధోబీఖానా వద్ద గల పెద్ద కాలువకు ఆనుకుని ఉన్న ఇళ్లలోకి చొరబడుతున్నాయి. అవి ఇళ్లలోకి ప్రవేశిస్తుండడంతో స్థానికులు భీతిల్లుతున్నారు. పందుల సమస్యపై జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వారు స్పందించటం లేదని ఆయా ప్రాంతాల స్థానికులు ఆరోపిస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

వాసవీ క్లబ్ వనిత నూతన కార్యవర్గం ఎన్నిక



సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న కందుల నాగరాజు తదితరులు

అల్లిపురం: వాసవీ క్లబ్ వనిత (కేజీ గుప్తా ఫెలో వైజాగ్ ఫెమినా క్లబ్) నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గోల్డెన్ కేజీ గుప్తా గవర్నర్, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షురాలిగా ఎస్.సుభద్ర, కార్యదర్శిగా సీహెచ్ గాయత్రి, కోశాధికారిగా కేవీ సూర్యకుమారి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కందుల నాగరాజు చేతుల మీదుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు చేసి ఆసుపత్రి ఖర్చులకు ఆర్థిక సహకారం చేశారు. పది మంది పేద విద్యార్థులకు కాలేజీ ఫీజులు అందజేశారు. పేదలకు అన్నదానం చేసి, దుప్పట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాసవీ క్లబ్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని నూతన కమిటీకి సూచించారు. కార్యక్రమంలో డి. నాగేశ్వరరావు, ఎస్.మహేశ్వరరావు, ముక్కు శ్రీనివాస్, వీవీ గుప్త, సాంబమూర్తి, ప్రసాద్‌గుప్త, బీవీ సావిత్రి, సత్యలక్ష్మి, చక్క చందన తదితరులు పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు అభినందనలు

దాబాగార్డెన్స్: కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ పి. అశోక్‌కుమార్‌ను బీసీ ప్రజా సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు తుమ్మిడి రామ్‌కుమార్, సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు కట్టా మల్లేశ్వరరావు, ఈగలపాటి యువశ్రీ, బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధి రొట్టా లాలాక్షి, లోలబట్టు అనసూయ, సీహెచ్ శ్రీదేవి, పిన్నింటి మంగ తదితరులు గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

విశాఖ, లీగల్: నవ్యాంధ్ర లాయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో 2023 క్యాలెండర్‌ను విశాఖ జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ హాల్లో గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శి వై.వేణుగోపాలరావు, ఉపాధ్యక్షుడు ఎస్.సన్యాసిరావు విచ్చేసి క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొయ్య హరిహరరెడ్డి, వై.వసంతలక్ష్మి, ఎస్.విజయకుమార్, బి.కరుణాకర్, ఎంపిరాజు, ఏడుకొండలు, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, DUMPALA HYMARAO W/o DUMPALA APPARAO, resident of Door No.38-30-42/206, Sailaxmi Sadan Apart., Sainagar, Marripalem, Visakhapatnam-18, AP. I have changed my name from DUMPALA HYMARAO APPARAO (Old name) to DUMPALA HYMARAO (New name). Hence here after all my Documents and correspondence will be continue with my new name DUMPALA HYMARAO.

స్నేహాంజలి మూర్తి శిష్య బృందానికి ఆహ్వానం

దాబాగార్డెన్స్ : గత 33 ఏళ్లుగా దేశ విదేశాల్లో తెలుగు సంప్రదాయాలు, తమ కళా కార్యక్రమాలతో ప్రవాసాంధ్రులను అలరిస్తున్న స్నేహాంజలి ఆర్ట్స్ శిష్య బృందానికి ఆహ్వానం అందిందని ప్రోగ్రామ్ డైరెక్టర్ వి. శైలజామూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న దేశ రాజధాని ఢిల్లీ ఆంధ్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సంక్రాంతి సంబరాలకు ఆహ్వానం పలికినట్టు ఆమె పేర్కొన్నారు. పల్లెల్లో జరిగే సంక్రాంతి పండగ వాతావరణాన్ని కళ్లకు కట్టేలా అనేక నృత్యరూపకాలతో ఢిల్లీలో గల ప్రవాసాంధ్రులను 15 మంది స్నేహాంజలి మూర్తి శిష్యబృందం అలరించనున్నట్టు ఆమె చెప్పారు.

షిర్డీసాయి దర్బార్‌లో బాబాకు ప్రత్యేక పూజలు



కీర్తనలు ఆలపిస్తున్న సత్యమాధురి తదితరులు

అల్లిపురం: వివేకానందకాలనీలో వెలసిన షిర్డీ సాయి దర్బార్‌లో గురువారం తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బాబాకు విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం లలిత మంజరి గ్రూపు వారి సహకారంతో భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. సర్వేజనా సుఖినోభవంతు టీం అధినేత సత్యమాధురి పర్యవేక్షణలో అన్నమాచార్య, త్యాగరాజ స్వామి కీర్తనలు భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. బాబాకు త్రికాల హారతులతో పాటు ప్రత్యేక హారతులు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు శ్రీనివాసశర్మ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని బాబాకు పూజలు చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com